# ఒక్క క్షణం కూడా ఉండొద్దు!

## దిగిపోవాల్సిందే.. సమాచార కమిషనర్లపై సుప్రీం కొరడా

**వర్రె వెంకటేశ్వర్లు, తాంతియ, ఇంతియాజ్, విజయ నిర్మలకు షాక్**

**ఎలా పని చేస్తున్నారన్నది కాదు.. ఎలా నియమితులయ్యారన్నదే ప్రశ్న!**

**మీకు ఆ పదవి చేపట్టే అర్హతే లేదు.. ఇన్నాళ్లెలా ఉన్నారు: బెంచ్** 12




ఆంధ్రజ్యోతి
Fri, 21 April 2017
epaper.andhrajyothy.com//c/19235775

# ఒక్క క్షణం ఉండొద్దు

## సమాచార కమిషనర్లపై సుప్రీం కొరడా.. వర్రె, తాంతియా, ఇంతియాజ్, విజయ నిర్మలకు షాక్

- **మీకు ఆ పదవి చేపట్టే అర్హతే లేదు**
- **ఇన్నాళ్లు మిమ్మల్ని ఉంచింది ఎవరు?**
- **సుప్రీం కోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో నియమితులైన నలుగురు సమాచార కమిషనర్లపై తక్షణం వేటు వేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వారి నియామకాలను రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. సమాచార కమిషనర్లుగా ఉన్న వర్రె వెంకటేశ్వర్లు, లాం తాంతియా కుమారి, ఇంతియాజ్ అహ్మద్, ఎం.విజయ నిర్మల ఒక్క క్షణం కూడా ఆ పదవుల్లో ఉండేందుకు వీల్లేదని తేల్చి చెప్పింది. "ఇది చాలా గౌరవప్రదమైన స్థానం. మేం గొప్పగా పని చేస్తున్నాం! పదవీ కాలం పూర్తయ్యేదాకా కొనసాగించండి ప్లీజ్" అని ఆ నలుగురు చేసుకున్న విజ్ఞప్తిని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. "మీరు ఎలా పనిచేస్తున్నారనేది ప్రశ్న కాదు. అసలు మీరు ఎలా నియమితులయ్యారన్నదే అసలు ప్రశ్న. సమాచార కమిషనర్లుగా నియమితులయ్యేందుకే మీకు అర్హత లేదు. అంటే.. మీరు ఒక్క క్షణం కూడా ఆ పదవుల్లో కొనసాగేందుకు వీల్లేదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ తేల్చి చెప్పారు.

**నాడు గవర్నర్ వద్దన్నా..**

ఉమ్మడి రాష్ట్రంలో 2011 డిసెంబర్ 14న అప్పటి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం 8 మందిని సమాచార కమిషనర్లుగా ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు ఫైలు పంపింది. 2012 జనవరి 31న కమిషనర్ల నియామకంపై ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడితో కూడిన కమిటీ భేటీ జరిగింది. ఈ ప్రతిపాదనలను గవర్నర్‌కు కమిటీ సిఫారసు చేసింది. అయితే, ఇందులో సి.మధుకర్ బాబు, ప్రభాకరరెడ్డి, విజయ బాబు, ఎం.రతన్‌లను మాత్రమే సమాచార కమిషనర్లుగా గవర్నర్ నియమించారు. వర్రె వెంకటేశ్వర్లు, లాం తాంతియాకుమారి, ఇంతియాజ్ అహ్మద్, ఎం.విజయనిర్మల పేర్లను తొలగించారు. వర్రె వెంకటేశ్వర్లు, తాంతియా కుమారి కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఇంతియాజ్ అహ్మద్ తెలుగుదేశం నేత. అంతకుముందు జరిగిన ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గంలో కిరణ్‌కుమార్‌రెడ్డిపై పోటీ చేశారు. ఇక... విజయనిర్మల ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా నూజివీడు నియోజకవర్గంలో పోటీ చేశారు. ఈమె మినహా మిగతా ముగ్గురూ హైకోర్టులో న్యాయవాదులు. రాజకీయ పార్టీల సభ్యత్వం ఉన్న వీరిని సమాచార కమిషనర్లుగా నియమించాలన్న ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు గవర్నర్ ఆ ఫైలును తిప్పిపంపారు. కానీ, ప్రభుత్వం 2013 జనవరిలో మరోమారు గవర్నర్‌కు ఫైలును పంపింది. అదే ఏడాది ఫిబ్రవరి 6న ఈ నలుగురూ సమాచార కమిషనర్లుగా నియమితులయ్యారు. వీరి నియమాకాలు అక్రమమని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మనాభయ్య(హోం శాఖ మాజీ కార్యదర్శి) హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల వాదనతో ఏకీభవించిన హైకోర్టు ఆ నలుగురి నియామకాలను రద్దు చేస్తూ 2013 సెప్టెంబర్ 12న తీర్పు ఇచ్చింది. వారు సుప్రీంలో సవాల్ చేయగా.. ఆ తీర్పుపై స్టే ఇచ్చింది. దీంతో ఈ నలుగురూ సమాచార కమిషనర్లుగా కొనసాగుతున్నారు. కేసు విచారణను గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ క్రిషన్ కౌల్‌ల ధర్మాసనం చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గురుకృష్ణకుమార్, పద్మనాభయ్య తరఫున న్యాయవాది ఆర్.చంద్రశేఖరరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది పాల్వాయి వెంకట్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ న్యాయవాది గుంటూరు ప్రభాకర్ హాజరయ్యారు. "రాజకీయ పార్టీల్లో సభ్యత్వం కలిగి ఉన్న వీరు నియామకాలకు అనర్హులు. వెంకటేశ్వర్లు, తాంతియా కుమారి, ఇంతియాజ్ అహ్మద్ ముగ్గురూ హైకోర్టులో న్యాయవాదులు. న్యాయవాద వృత్తిని కొనసాగించకుండా తమను ఐదేళ్లు తప్పించాలని బార్ కౌన్సిల్‌కు విజ్ఞప్తి చేయలేదు" అని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అయితే... తమకు పార్టీలతో సంబంధం లేదని, విరుద్ధ ప్రయోజనాలు కలిగిన ఏ పదవిలోనూ కొనసాగటం లేదని అప్పట్లోనే ఒక అఫిడవిట్‌ను ఇచ్చామని ఆ నలుగురి తరఫు న్యాయవాది గురుకృష్ణకుమార్ తెలిపారు. అలాంటి పత్రాలేవీ లేనందునే వారి నియామకాలు రద్దు చేస్తున్నట్లు హైకోర్టు తన తీర్పులో చెప్పిందని జస్టిస్ ఖేహర్ గుర్తు చేశారు. వాటిని ఇప్పుడు సమర్పిస్తామని గురుకృష్ణకుమార్ చెప్పగా... 'ఇప్పుడు మేం పరిగణనలోకి తీసుకోం' అని జడ్జి స్పష్టం చేశారు. అదే సమయంలో... అఫిడవిట్లు ఇస్తే సరిపోదని, రాజీనామా చేసినట్లు ధ్రువీకరణ పత్రం ఉండాలని చెప్పారు. అయినా, వీరిని ఇంత కాలం కొనసాగనిచ్చింది ఎవరు? అని ప్రశ్నించారు. "మరో పది నెలలు మాత్రమే వారికి పదవీకాలం ఉంది. అప్పటిదాకా కొనసాగనివ్వండి" అని గురు కృష్ణకుమార్ కోరారు. ఇందుకు జస్టిస్ ఖేహర్ ససేమిరా అన్నారు.

ఆంధ్రజ్యోతి Fri, 21 April 2017
epaper.andhrajyothy.com/c/18459432